## మనోహరంగా రామయ్య కళ్యాణం



8లో..

ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
బుధవారం 6, డిసెంబర్ 2023 8 పేజీలు

# వణికిస్తున్న మిచౌంగ్



- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- పంటలను కాపాడుకునే పనిలో పడ్డ రైతులు
- అకాల వర్షానికి తడిసిన వరి, పత్తి పంటలు
- విపరీతంగా పెరిగిన చలితో వణికిపోతున్న జిల్లా వాసులు
- అశ్వారావుపేటలో అత్యధికంగా 34.6 మిల్లీమీటర్ల వర్షం
- జిల్లాలో సగటున 10.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

2 లో..

కొత్తగూడెం/చుంచుపల్లి ,ప్రభాతవార్త: "ఆరుగాలం కష్టపడ్డారు... పంట కూడా ఆశించినస్థాయిలో వస్తోంది... ఇంకేముంది... పంటలు కోసి విక్రయించుకుందాం... పెట్టుబడులు పోను ఎంతోకొంత లాభం వస్తుంది... అని ఆశపడ్డ రైతుల ఆశలను నిరాశలు చేస్తూ మిచౌంగ్ తుఫాన్ దాడి చేసింది..." అసలు ఊహించని విధంగా జిల్లాను మిచౌంగ్ తుఫాన్ తాకింది. నిన్నమొన్నటి వరకు ఎండగా ఉన్న సమయంలో వరి కోతలు, నూర్పిడి, యంత్రాలతో కోతలు, కల్లాల్లో ధాన్యం ఆరబోత, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు ఇలా చెకచెక పనులు జరుగుతుండగా ఒక్కసారిగా వచ్చిన మిచౌంగ్ తుఫాన్‌తో రైతులందరూ విలవిల్లాడారు. జిల్లా వ్యాప్తంగా అంతా అతలాకుతలం అయింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా ముసురు వానలు, ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నంలో రైతులు పరుగులు తీశారు.

### తుఫాన్ ప్రభావం వల్ల రానున్న రెండు రోజులు

## జిల్లాకు భారీ వర్షసూచన



- ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల

కొత్తగూడెం కలెక్టరేట్, ప్రభాతవార్త: మిచౌంగ్ తుఫాన్ ప్రభావం వల్ల రానున్న రెండు రోజులు జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో నేడు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై మంగళవారం ఉదయం అన్ని శాఖల జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

8లో..



2 లో..

### ఎడతెరపిలేని వర్షంతో

# నిలిచిన బొగ్గుఉత్పత్తి

ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త: తుఫాన్ ప్రభావంతో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగిందనే చెప్పొచ్చు. సింగరేణి ఇల్లెందు ఏరియాలోని కోయగూడెం ఉపరితలగనిలో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో ఉపరితలగనిలోకి భారీగా నిరుచేరడంతో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. బొగ్గు ఉత్పత్తితోపాటు మట్టితొలగింపు (ఓబీ) పనులు సైతం ఆగిపోయాయి. ఉపరితలగనిలో షిఫ్టుకు 3వేల టన్నుల బొగ్గుఉత్పత్తి జరగాల్సి ఉన్న నేపథ్యంలో వర్షం కారణంగా మూడు షిఫ్టుల్లో బొగ్గు ఉత్పత్తి పనులను నిలిచిపోవడంతో సుమారు 10వేల టన్నుల బొగ్గుఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలిగింది.

- కోయగూడెంలో నిలిచిన 10వేల టన్నుల బొగ్గుఉత్పత్తి
- 35వేల క్యూబిక్ టన్నుల మట్టి తొలగింపు ఆగింది
- నిర్విరామంగా కురుస్తున్న వర్షంతో ఉపరితలగనుల్లోకి భారీగా నీరు
- తుఫాన్ ఎఫెక్ట్‌తో రెండోరోజు సింగరేణిలో నిలిచిపోనున్న ఉత్పత్తి

# తుఫాన్ ప్రభావంతో రైతుల్లో ఆందోళన

### -దుమ్ముగూడెం మండలంలో

### తుఫాను ప్రభావంతో పంటలు నష్టం

*దుమ్ముగూడెం, ప్రభాతవార్త :*

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో దుమ్ముగూడెం మండల వ్యాప్తంగా మంగళవారం వర్షం పడింది. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పంటలు చేతికి



అందివచ్చిన తరుణంలో తుఫాను ప్రభావం వల్ల మండల వ్యాప్తంగా వర్షాలు కురవడంతో పలు చోట్ల వరి పంట నేలకొరిగింది. పత్తి పంట కాపుకు



వచ్చి తీసేతరుణంలో వర్షానికి పత్తి నల్లగే మారే అవకాశాలు ఉన్నందున రైతుల్లో ఆందోళన మొదలైంది. అసలే ఈ సంవత్సరం అంతంత మాత్రంగా కురిసిన వర్షాలకు రైతాంగం నానా అవస్థలు పడి తమ పంటలను పండించేందుకు




పడరాని పాట్లు పడ్డారు. తీరా పంట చేతికి అందివచ్చిన తరుణంలో తుఫాను రూపంలో వర్షాలు పడి పంటలను నాశనం చేసింది. అనేక చోట్ల వరి పంటలు నేలకు ఒరగగా, వరి కోతలు కోసం మెదలపై ఉంచగా అట్టి పంటలు కూడా



నీటిలో తడిసాయి. ఇదిలా ఉండగా మిర్చి రైతులు కూడా ఈ వర్షాలకు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు, మబ్బుల వల్ల మిర్చిపంటకు తెగుళ్ళు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని వర్క్‌షాపు, నల్లబెల్లి, బండిరేవు, గంగోలు, సీతారాంపురం తదితర గ్రామాల్లో వరి పంట నేలకు ఒరిగింది. కళ్ళాల్లో పెట్టిన ధాన్యం వద్దకు వర్షపు నీరు చేరడంతో తడిసిన ధాన్యాన్ని ఎత్తైన ప్రదేశాల్లో పెడుతున్నారు. ఏది ఏమైనా అకాల వర్షం రైతాంగానికి భారీ నష్టాన్ని కలిగిస్తుంది.

# పినపాక ఏజెన్సీలో రైతు కన్నీళ్లు

## -అకాల వర్షంతో కల్లాల్లో తడిసిన పంటలు





*మణుగూరు, ప్రభాతవార్త, డిసెంబర్ 5 :*

పినపాక ఏజెన్సీలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావం పడింది. దీంతో రైతులు నష్టపోయారు. పినపాక నియోజకవర్గంలో వరి కోతలు, మిర్చి ఏరడం, పత్తితీయడం వంటి పలను జోరుగా జరుగుతున్నాయి. అనుకోకుండా సోమవారం రాత్రి నుంచి మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో వర్షం కురవడంతో వరి కోసి వడ్లను ఆరబోసిన రైతులు, కల్లాల్లో మిర్చి, పత్తి ఉన్న రైతులు పంటలు తడిసి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. పినపాక, మణుగూరు, గుండాల, అశ్వాపురన, బూర్గంపాడు, ఆళ్లపల్లి, కరకగూడెం మండలాలల్లో వర్షం వల్ల పంటలు తడిసి రైతులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు పడనుండడంతో ఇంక ఎంత నష్టం జరుగుతోందనని భయంతో వణికి పోతున్నారు. కొంత మంది రైతులు పంటపై టార్ఫలిన్లు కప్పారు. చేతి కొచ్చిన పంట వర్షం తుఫాన్ ప్రభావంతో వర్షం కురిసి నష్టం జరగడంతో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. వర్షంతో పంటలు నష్టపోయిన రైతులు తమను అదుకోవాలని అన్ని రకాలుగా అధికారులు న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### -అధికారులు ప్రజలకు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలి

### - ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

*మణుగూరు, ప్రభాతవార్త, డిసెంబర్ 5 :*

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మిచౌంగ్ తుఫాన్ ఉధృతంగా వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అధికారులు అందుబాటులో ఉండి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. పినపాక ఏజెన్సీ ప్రాంతాంలోని రైతులు పంట నష్టం జరగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. నియోజకవర్గంలోని అధికారులు ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేయవద్దని, ప్రజలకు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. తుఫాన్ వల్ల ఎక్కడైనా పంట నష్టం, ఆస్తి నష్టం జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రజలు ఆధైర్య పడవద్దని, తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రజలు ఇంటి బయ టకు రావ్వని అన్నారు. ఇప్ప టికే తుఫాన్‌కు సంబంధించిన చర్యలపై



జిల్లా కలెక్టర్, ఆర్డీవో, వ్యవసాయం, ఉద్యానవన, వాణిర్యు పంటలు, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లా డినట్లు, అత్యతసర సేవలకు జిల్లా కలెక్టర్ కార్యా లయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్ 08744 241950కు సంప్రధించాలని ఆయన తెలిపారు.




## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ



*భద్రాచలం అర్బన్, ప్రభాతవార్త :*

లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీ.హెచ్.వీ.శివప్రసాద్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు భీమవరపు వెంకట్‌రెడ్డి, క్లబ్ కార్యదర్శి గుండు శరత్, కోశాధికారి జీ.భరత్‌కుమార్, మెంబర్షిప్ గ్రూప్ చైర్మన్ బొల్లి పెల్లి రంగారెడ్డి, ఎం.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### మిచౌంగ్ తుఫాను నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

### - ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు

*భద్రాచలం అర్బన్, ప్రభాతవార్త :*

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాను ప్రభావం కారణంగా బుధ, గురువారాలలో ఉమ్మడి జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భద్రాచలం నియోజకవర్గ ఏజెన్సీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలు ఇంట్లో నుండి బయటకు రాకూడదని, రైతులు వరి కోత చేపట్టడం వంటి వ్యవసాయ పనలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిదని, అలాగే వరికోత చేపట్టిన రైతులు ధాన్యాన్నిముందుగా జాగ్రత్త ప్రదేశానికి తరలించి, కళ్ళల్లో ఉన్న వడ్లను టార్పాలిన్ కవర్‌తో జాగ్రత్తగా తడవకుండా కప్పుకోవాలని సూచించారు. అలాగే కరెంటు స్థంబాలను ముట్టుకోవద్దని ప్రజలు ఈ రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలని భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు కోరారు.



## ప్రింటింగ్ ప్రెస్ దారుల నుండి షార్ట్ టెండర్‌లకై దరఖాస్తుల ఆహ్వానం

*భద్రాచలం, ప్రభాతవార్త :*

భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ దారుల వద్ద నుండి షార్ట్ టెండర్‌లకు ధరఖాస్తులు కోరుతున్నట్లు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ భద్రాచలం ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. రెండు జిల్లాల్లో గల ఆశ్రమ పాఠశాలలకు 10వ తరగతి విద్యార్థులకు గాను స్టడీ మెటీరియల్, స్లిప్ టెస్టులు నిర్వహించుటకు తగు పేజీలు (19,79,880) ముద్రించి సరఫరా చేయుటకు గాను ఆసక్తి గల ప్రింటింగ్ ప్రెస్ దారుల నుండి షార్ట్ టెండర్లు కోరుతున్నట్లు తెలియజేశారు. కావున ఆసక్తి గల ప్రింటిగ్‌దారులు వారి యొక్క షార్ట్ టెండర్ ఫారాలను డీడీ(టిడబ్ల్యూ) కార్యాలయంలో తగు రుసుము చెల్లించి పొందాల్సిందిగా కోరారు. ఇట్టి టెండర్లను ప్రాజెక్టు అధికారి సమక్షంలో తెరిచి తుది నిర్ణయం తీసుకొనబడునని, ఇట్టి టెండర్ ఫారాలను ఈ నెల 12వ తేదీ సాయంత్రం లోగా సమర్పించాలని తెలియజేశారు. టెండర్ ప్రక్రియను ఈ నెల 13వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించబడునని అన్నారు. పూర్తి వివరాలకు 7660002033,9701315526 (గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు) నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

## మిచౌంగ్ తుఫాన్ దృష్ట్యా రెండు రోజులు పాఠశాలలకు సెలవు

జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల



**కొత్తగూడెం ఎడ్యుకేషన్, ప్రభాతవార్త:** మిచౌంగ్ తుఫాన్ దృష్ట్యా రాగల రెండు రోజులు భారీ వర్ష సూచన ఉన్న నేపద్యంలో మంగళ, బుధ వారాలు రెండు రోజులు ప్రభుత్వ, ప్రైవేట్‌లలో అన్ని విద్యా సంస్థలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ప్రకటించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వసతి గృహాల్లో ఉండే విద్యార్థులను హాస్టల్ విడిచి బయటకు వెళ్లకుండా నియంత్రణ చేయాలని చెప్పారు. అత్యవసర సేవలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08744-241950 సంప్రదించాలని చెప్పారు. తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, అత్యవసరమైతే తప్ప ఇతర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని, ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని చెప్పారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ యంత్రాంగం సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు.

## పినపాక ఆర్వోను మర్యాదపూర్వకంగా కలిసిన మణుగూరు డీఎస్పీ



**భద్రాచలం, ప్రభాతవార్త :** పినపాక నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడం సంతోషకరమని మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు మంగళవారం భద్రాచలం ఐటిడిఏకు వచ్చి పినపాక రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్‌ని పీవో ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ .. పోలీసు అధికారుల సమన్వయంతోనే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ విజయవంతం అయ్యిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ, పోలీసు అధికారులు, మణుగూరు తహిసిల్దార్, పినపాక నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## భూసారం ఆధారంగా పంట దిగుబడులు

**అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** సాగుకు అనుగుణంగా వ్యవసాయ నేలల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి విజయకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మృత్తికా దినోత్సవాన్ని మంగళవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించి ఆరోగన కర నేలల పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలలు నీరు జీవానికి ఆధారం అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గాను ప్రపంచ వ్యాప్తంగా పలు కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. భూసారం పైనే పంట దిగుబడి ఆధారపడి ఉంది కావున మృత్తికా ఆరోగ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ పాటు పడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ ఎండి హుస్సేన్, కట్టా సుబ్బారావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.




## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే డా.తెల్లం

**భద్రాచలం, ప్రభాతవార్త:** భారత రాష్ట్ర సమితి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావును ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన డా.తెల్లం వెంకట్రావు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ మరియు భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ తాత మధుసూదన్‌తో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గెలిచిన డా.తెల్లం వెంకట్రావును, గెలుపుకు అహర్నిశలు కృషి చేసిన తాత మధుసూదన్‌ను ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్, మాజీ వైద్యఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావులు అభినందించారు.



## గోమాతల సన్నిధిలో గోవిందుడి దర్శనం

### నేటి నుండి ఈ నెల 10 వరకు గోశాల ప్రారంభోత్సవ వేడుకలు
### బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నృసింహా సేవా వాహిని




**భద్రాచలం, ప్రభాతవార్త :** శ్రీనృసింహా సేవా వాహిని మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. భద్రగిరిపై అద్భుతమైన గోశాలను నిర్మించింది. గోవుని గోవిందుడిని ఒకే దగ్గర దర్శించి తరించే భాగ్యాన్ని భక్తులకు కలగాలనే ఉద్దేశ్యంతో సంస్థ వ్యవస్థాపకులు డా.కృష్ణచైతన్యస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీనృసింహా భక్త కుటుంబం ఆధ్వర్యంలో గో - గోవింద కల్పవృక్ష నారసింహా సాలగ్రామ ఆశ్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డా.కృష్ణచైతన్య స్వామి మాట్లాడుతూ .. రోజు రోజుకు గోవుకు ఆదరణ తగ్గుతున్నదని, గోమాత ప్రాముఖ్యతను లోకానికి చాటి చెప్పడానికి ఈ సుందరమైన గోశాల నిర్మాణం చేయడానికి పూనుకున్నామని, సకల దేవతా రూపమైన గోమాతను గోవిందున్ని ఏక కాలంలో దర్శిస్తేఎంతో పుణ్యం కలుగుందని అన్నారు. అంతేకాకుండా తమ పూర్వీకుల నుండి వారసత్వంగా పూజలు అందుకుంటూ వస్తున్న 750 సంవత్సరాల క్రితం నాటి కల్ప వృక్ష నరసింహా సాలగ్రామమూర్తిని కూడా భక్తులు తరించే భాగ్యాన్ని అందరికి కల్పించనున్నామని అన్నారు. ఇక్కడ నారసింహుని రక్ష కట్టుకుని ముడుపులు కడితే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే సుదూర ప్రాంతాల నుండి ప్రతి నిత్యం కొన్ని వందల మంది దర్శనం కొరకు వస్తుంటారని, ఎంతోమంది కోర్కెలు నెరవేరి మళ్ళీ మళ్ళీ రావడం సకాలంలో కొన్ని కొన్ని సార్లు వారికి దర్శనబాగ్యం కలగకపోవడంతో భక్తుల సౌకర్యం కొరకు గోవుని గోవిందున్ని ఒక దగ్గర చేర్చి ప్రతి ఒక్కరికి దర్శన భాగ్యం కలిగించాలని ఈ మన్యంలో గోవు -గోవింద -కల్పవృక్ష నారసింహా సాలగ్రామ ఆశ్రమాన్ని నిర్మించడం జరిగిందని అన్నారు. డిశంబర్ 6వ తారీఖు బుధవారం నుండి డిశంబర్ 10వ తారీఖు ఆదివారం వరకు ప్రతి రోజు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నామని అన్నారు. ప్రతి రోజు శ్రీ లక్ష్మీనారసింహా హోమం, సుదర్శన హోమంతో పాటు శ్రీమహాలక్ష్మి అమ్మవారి సంపూర్ణ అనుగ్రహం భక్తులందరికి కలగాలని మహాలక్ష్మి యాగాన్నినిర్వహించనున్నామని అన్నారు. అంతేకాకుండా ప్రతి రోజు దర్శనం కొరకు వచ్చే యాత్రికులకు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం కూడా ఉన్నదని, కావున భక్తులందరూ స్వామి వారిని దర్శించి తరించాలని కోరారు.

## కాంగ్రెస్‌ని ఎన్నుకున్నందుకు ప్రజలే నష్టపోవాలి

### వచ్చినవాడు దరిద్రుడని అర్థంకావాలి
### కెసిఆర్ విలువేంటో త్వరలో తెలుస్తుంది
### ఛైర్మెన్ పదవికి తక్షణం రాజీనామా చేస్తా
### నా తర్వాత మార్పుని రైతులే చూస్తారు
### సిద్ధిపేట ఫ్యాక్టరీ ఆగదు

**సత్తుపల్లి-ప్రభాతవార్త** ప్రజలు మార్పు కోరుకున్నారు వాళ్ళని అనునయించడం తప్ప ఇప్పుడు చేయగలిగేది ఏదీ లేదని.,ఐతే కాంగ్రెస్‌ని ఎన్నుకున్నందుకు ప్రజలే త్వరలో శిక్ష అనుభవిస్తారంటూ తెలంగాణా ఆయిల్‌ఫెడ్ ఛైరె మ్‌న్ కంచర్ల రామకృష్ణారెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ప్రభాతవార్తతో ఆయన మంగళవారం ఫోన్‌లో మాట్లాడుతూ ప్రజల తీర్పుని గౌరవించాలంటూనే.,తెలంగాణా ప్రజలకు గతమేమిటో.,ప్రస్తుత కాంగ్రెస్ పాలనేంటో కేవలం ఏడాదిలోనే తెలిసిపోతుందని, "అరెరె..కాంగ్రెస్‌కి ఓటేసి తప్పుచేశాం.,దాని ఫలితాన్ని అనుభవిస్తున్నాం" అంటూ ప్రజలంతా పశ్చాత్తాపపడే దుస్థితి దాపురిస్తుందన్నారాయన. అంతే కాకుండా "అల్టిమేట్‌గా ప్రజలే నష్టపోతారు-నష్టపోవాలికూడా-కెసిఆర్‌ని పోగొట్టుకున్నందున శిక్ష అనుభవించాలి కూడా" అంటూ మాట్లాడారు. బిఆర్ఎస్ పాలన ప్రజారంజకంగా సాగిందని, ఈ మార్పు ఎవరూ ఊహించనిదని కామెంట్ చేశారు. తాను తన ఛైర్మెన్ పదవికి త్వరలో రాజీనామా చేస్తానని, ముఖ్యమంత్రి ఇచ్చిన బాధ్యతను ఆయనతోపాటే వదిలేసుకుంటానని వెల్లడించారు. ఒక పార్టీలో పదవిని పొంది మరో పార్టీ ప్రాపకంకోసం పాకులాడి ప్రయోజనాలను కొనసాగించాలని పాకులాడే మనిషిని కాదని, తానెప్పుడూ వామపక్షభావజాలంతోనే ముందకు కదులుతానని శెలవిచ్చారు. తన హయాంలో రాష్ట్రవ్యాప్తంగా పామాయిల్ అభివృద్ధికి ఎనలేని సేవలందించానని, తరువాత ఛైర్మెన్‌గా ఎవరొస్తారో, ఎలా పనిచేస్తారో అప్పుడుగానీ తన ఉనికి తెరమీదకు రాదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వాం మారినంత మాత్రాన సిద్ధిపేట పామాయిల్ ఫ్యాక్టరీ ప్రతిపాదన మరుగున పడదని, వ్యవస్థ నిరంతరం కొనసాగుతుందన్నారు. ఇప్పటిదాకా తనకు సహకరించినవారందరికీ ఆయన చివరిసారిగా ధన్యవాదాలర్పించారు.

## గండుగులపల్లి గ్రామానికి ప్రత్యేక స్థానం

### గ్రామానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలుగా విజయం






**దమ్మపేట, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలలో దమ్మపేట మండలంలోని గండుగులపల్లి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు లభించింది. మండల పరిధిలోని గండుగుపల్లి గ్రామానికి చెందిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం స్థానం నుండి కాంగ్రెస్ తరపున పోటీ చేసి విజయం సాధించారు. అదే విధంగా గండుగులపల్లి గ్రామానికి చెందిన జారె ఆదినారాయణ కాంగ్రెస్ తరపున అశ్వారావుపేట నియోజకవర్గ స్థానానికి పోటీ చేసి విజయం సాధించారు. ఇద్దరు ఒకే గ్రామానికి చెందిన వారు కావడం ఒకే పార్టీ నుండి విజయం సాధించడంతో దమ్మపేట మండలానికి ప్రత్యేక గుర్తింపు దక్కింది. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దాదాపు 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉండగా ఆయన మంత్రిగా చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈక్రమంలో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేఫథ్యంలో బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. అంతే కాకుండా ఖమ్మంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పోటీకి దిగి ఘన విజయం సాధించారు. ఈయనకు క్యాబినెట్‌లో కూడా స్థానం దక్కే అవకాశం ఉందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. దీంతో ఉభయ ఖమ్మం జిల్లాకు మహార్దశ పట్టనుంది. అదే విధంగా జారె ఆదినారాయణ బిఆర్ఎస్ పార్టీని వీడి మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో కాంగ్రెస్‌లో కొన్ని నెలల క్రితం చేరారు. ఈయన కూడా అశ్వారావుపేట అసెంబ్లీ స్థానం కాంగ్రెస్ తరపున ఆయనకు దక్కడంతో బిఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుపై అఖండ విజయం సాధించారు. గ్రామానికి చెందిన మరియు ఒకే పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలుగా విజయం సాధించడం ఆ పార్టీ అధికారంలోకి రావడంతో దమ్మపేట మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామం నుండి అసెంబ్లీలో ఇద్దరు ఎమ్మెల్యే ఉన్నారని చెప్పుకోవడం ఎంతో గర్వంగా ఉందని గ్రామానికి చెందిన పలువురు పెద్దలు వ్యక్తపరుస్తున్నారు.

# తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు






## ఇంఫ్లాటెడ్ రెస్క్యూ బోట్స్ సిద్ధం

**ఖమ్మం, డిసెంబర్ 05, ప్రభాతవార్త :** తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపిలేని వర్షాలు జిల్లా యంత్రాంగం ఇప్పటికే ప్రజలను చేస్తూ ముందస్తు చర్యలు చేపట్టింది. రాగల 24 గంటల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో జిల్లా కలెక్టర్ విపి గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. భారీ వర్షాల సహాయక చర్యలకు 2 ఇంఫ్లాటెడ్ రెస్క్యూ బోట్స్ విత్ అవుట్ బోట్ మోటార్స్ సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ ప్రత్యేక చొరవతో జిల్లాలో విపత్తుల సమయంలో సత్వర సహాయక చర్యలకు ఒక్కొక్కటి రూ. 6లక్షలతో రెండు కొనుగోలు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో 20 మందికి బోట్లపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఒక్కో బోట్ 8 మందిని క్యారీ చేస్తుంది. ప్రస్తుత భారీ వర్షాల నేపథ్యంలో సత్తుపల్లి, మధిర లలో ఈ బోట్లు, సిబ్బందితో సహా సహాయక చర్యలు చేపడుతున్నారు.

# తుఫాన్ ప్రభావంతో నిర్విరామ వర్షం

## -వర్షంతో నిర్మానుష్యంగా మారిన రహదారులు-వానతో బయటకురాని జనం



**ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త:** తుఫాన్ ఎఫెక్ట్‌తో ఇల్లెందు ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. రెండు రోజులపాటు వర్ష ప్రభావం ఉంటుందని వాతావరణ హెచ్చరికతో మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రియాంక అల పాఠశాలలకు సెలవును సైతం ప్రకటించింది. నిర్విరామంగా కురుస్తున్న వర్షంతో ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. వర్షంతో పాటు చలిప్రభావం తీవ్రంగా ఉండటంతో వృద్ధులు, చిన్నపిల్లలు, పెద్దలు వనికిపోతున్నారు. తుఫాను ప్రభావంతో భారీగా కురుస్తున్న వర్షంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దంటూ అధికారులు సైతం పేర్కొనడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాకపోవడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. పలు దుఖాణాలు సైతం తెరచుకోలేదు. వర్షం ప్రభావంతో జ్వరాలు, జలుబు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచిస్తున్నారు. ఇటు విద్యుత్తు శాఖ సైతం వర్షం పడుతున్న నేపథ్యంలో విద్యుత్తు స్తంభాలను ముట్టుకోవడం, ఇళ్లలో సైతం తడిచేతులతో స్విచ్‌లను, వైర్లను ముట్టుకోవద్దని ముఖ్యంగా చిన్నపిల్లలను అప్రమత్తంగా ఉంచాలని సూచిస్తున్నారు. ఏది ఏమైనా ఒకవైపు చలిపులితో వనుకుతున్న ప్రజలకు తుఫాన్ ఎఫెక్ట్ వల్ల కురుస్తున్న భారీ వర్షంతో ప్రజలు వణికిపోతున్నారు.


## తుఫాన్ దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలి

**నేలకొండపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త:** మిచౌంగ్ తుఫాన్ ప్రభావం దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని నేలకొండపల్లి మండల వ్యవసాయ అధికారిణి దేశబోయిన అరుణకుమారి తెలిపారు. మంగళవారం ఆరెగూడెం గ్రామంను ఆమె సందర్శించారు. వరి పొలాలను ఆమె పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు తెలిపారు. తుఫాన్ ప్రభావం వలన రాగల మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని రైతులు తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఆమె చెప్పారు. తుఫాన్ ప్రభావంతో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆమె అన్నారు. ఈ సమయంలో రైతులు విత్తనాలు వేయడం, మందులు పిచికారి చేయడం, ఎరువులు వేయడం, వరి కోతలు చేపట్టడం వంటి వ్యవసాయ పనులు చేయకుండా తాత్కాలికంగా వాయిదా వేయాలని ఆమె చెప్పారు. వరి కోత చేపట్టిన రైతులు ధాన్యాన్ని ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతానికి తరలించి, టార్పాలిన్ కవర్లతో ధాన్యాన్ని కప్పి భద్రపర్చుకోవాలని చెప్పారు. రైతులు అందరు తమ మొబైల్ ఫోన్‌లో దామిని యాప్ (మెరుపులు, ఉరుములు హెచ్చరించే యాప్) డౌన్‌లోడ్ చేసుకుని ముందుగానే వాతావరణ పరిస్థితులు ఫోన్‌లో చూసుకుని సురక్షిత ప్రాంతాలలో ఉండాలని ఆమె చెప్పారు. ఇటువంటి సమయాలలో రైతులు పొలాల దగ్గరకు వెళ్ళకుండా జాగ్రత్తగా ఉండాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో, పలువురు రైతులు పాల్గొన్నారు.



## తుఫాన్ ప్రభావంతో అన్నదాతలు ఆందోళన

**అశ్వాపురం,డిసెంబర్05,ప్రభాతవార్త.** మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మండలంలోని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వారంరోజులుగా వానాకాలం వరికోతలు కొనసాగుతున్నాయి. తుఫాన్ ప్రభావంతో కొనుగోలు కేంద్రాలకు చేర్చిన ధాన్యాన్ని తడవకుండా కాపాడేందుకు అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు కోతలకు సిద్ధంగావున్న వరిచేలలో,కూలీలతో కోసిన వరిపనలపై నీరు నిల్వడంతో నీటిని వెళ్లదీసే పనులలో రైతన్నలు నిమగ్నమయ్యారు. మరో రెండు రోజులపాటు వర్షాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు.






# అకాల వర్షంతో వరి పైరుకు నష్టం

## కల్లాల్లోనే తడిసి ముద్దయిన ధాన్యం



**తల్లాడ, డిసెంబర్ 05, ప్రభాతవార్త** సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు లబోదిబో మంటున్నారు. కొందరు వరి కోసి కల్లాల్లో ఉంచగా మరి కొందరు పంట నూర్పిడి చేసి పట్టాల్లో ఉంచగా అకాల వర్షం తమ పాలిట శాపమైందని రైతులు ఆరోపిస్తున్నారు. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పంట పొలాలన్నీ జలమయమయ్యాయి. మంగళవారం ఉదయం నుండి వర్షం ఎడతెరిపి లేకుండా కురవడంతో సాధారణ పౌరులు కూడా ఇంటి నుండి బయటకు వెళ్ళే పరిస్థితి లేకుండా పోయింది. అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## నూతన క్యాబినెట్‌లో బ్రాహ్మణులకు అవకాశం ఇవ్వండి



**భద్రాచలం, ప్రభాతవార్త :** తెలంగాణలో ఏర్పడుతున్న నూతన క్యాబినెట్‌లో బ్రాహ్మణులకు అవకాశం ఇవ్వాలని, గత దశాబ్దం కాలంగా ఉభయ తెలుగు రాష్ట్రాల మంత్రివర్గాలలో బ్రాహ్మణులకు అవకాశం లభించలేదని గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామా వజ్జల రవికుమార్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాగవతుల వెంకటేశ్వర ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బి.రామాచార్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వేజనా సుఖినోభవంతు అని ఆకాంక్షిస్తూ అన్ని వర్గాల ప్రజల అభివృద్దిని కోరుకునే బ్రాహ్మణులకు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో తెలంగాణలో ఏర్పడుతున్న నూతన ప్రభుత్వంలో శాసనసభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ప్రధాన శాఖను కేటాయించాలని గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామా వజ్జల రవికుమార్ శర్మ కాంగ్రెస్ పార్టీకి కాబోయే నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి

### తహశీల్దార్ వి. రవికుమార్ విజ్ఞప్తి



**తల్లాడ, డిసెంబర్ 05, ప్రభాతవార్త** మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ వి. రవికుమార్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్నందున ప్రజలు పని ఉంటేనే ఇళ్ళ నుండి బయటకు రావాలని, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండవద్దని కోరారు. వాగులు, చెరువుల వద్దకు వెళ్ళవద్దని, మత్స్యకారులు కూడా వైరా రిజర్వాయర్‌లోకి వేటకు వెళ్ళవద్దని కోరారు.

# రైతన్న పాలిట శాపంగా మారిన మీచౌంగ్ తుఫాన్

**కల్లూరు, డిసెంబర్ 05, ప్రభాతవార్త**

కల్లూరు మండల అన్నదాతలకు మీచౌంగ్ తుఫాన్ విషాదం మిగిల్చింది. కల్లూరు మండలంలో తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాలలో వరి, మిర్చి పంటలు నీట మునిగి నేల రాలడంతో అపార నష్టం వాటిల్లి రైతున్న కుదేలయ్యాడు. కల్లూరు మండలంలో లక్ష్మీపురం, పుల్లయ్య బంజర్, కొర్లగూడెం, నారాయణపురం, చెన్నూరు, పెద్దకోరుకొండి, పోచవరం, చిన్నకోరుకొండితో పాటు పలు గ్రామాల్లో వేల హెక్టార్లలో వరి, మిర్చి, పత్తి, కూరగాయ పంటలను సాగు చేశారు. ఈ వ్యవసాయ సీజన్లో రైతన్నలకు బోర్లు, చెరువుల క్రింద, మోటార్ల సహాయంతో పండిన పంట చేతికొచ్చే సమయంలో మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందాన మీచౌంగ్ తుఫాన్ రైతన్న పాలిట శాపంగా మారింది. చేతికం అందిన పంట రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి పాలు అవడంతో చేతికి అందిన పంట దెబ్బతిందని రైతులు లబోదిబో మంటున్నారు. అలాగే లక్షల రూపాయల పెట్టుబడితో మిర్చి పంటను వేసి రైతులు ఈ తుఫాన్ కన్నీళ్ళు



మిగిల్చిందని రైతులు వాపోతున్నారు. వేసిన పంట కనీసం పెట్టిన పెట్టుబడైన వస్తుందో రాదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తగా ఏర్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని, తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు అండగా నిలుస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నారు.

# అభివృద్ధి ప్రధాత ఓటమికి కారణాలేమిటి ...?

*-నేతల సంఖ్య అధికమైనా ఓటమి తప్పలేదు -అంతా నా వాళ్లే నమ్మిన సండ్ర*
*-నమ్మిన వాళ్లే నట్టేట ముంచారు. -రూ. 1000 కోట్ల అభివృద్ధి ఎందుకు గెలిపించలేదు*

**సత్తుపల్లి, డిసెంబర్ 5, ప్రభాతవార్త:**

మహా భారత సంగ్రామంలో కర్ణుడికి ఎన్ని శాపాలున్నాయో బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్య ఓటమికి కూడా అదే తరహాలో శాపాలున్నట్లుగా ఆయన ఓటమి విధానాన్ని బట్టి వ్యక్తమవుతుందని పలువురు వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులకు శక్తి వంచన లేకుండా పని చేసిన సండ్ర వెంకట వీరయ్యను ఓటర్లు తిరస్కరించడంలో సవాలక్షా కారణాలుగా విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. సత్తుపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా సండ్ర వెంకట వీరయ్యను ఆ పార్టీ అధినేత కేసీఆర్ రెండు నెలల ముందుగానే అభ్యర్థిగా ప్రకటించగా నియోజక వర్గమంతా సండ్ర విస్తృతంగా పర్యటించారు. ఈ నియోజకవర్గం ఎస్సీగా రిజర్వ్ అయిన దగ్గరి నుండి 2009, 2014, 2018లో 3 సార్లు జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుండి విజయం సాధించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీలోకి నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారి ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో దాదాపు రూ. 1000 కోట్ల అభివృద్ధి పనులు చేసి అలాగే సత్తుపల్లి పట్టణంలో రూ. 00 కోట్లు ఖర్చు చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దామని వారు ప్రచారం చేస్తున్నారు. ఇన్ని కోట్ల రూపాయల అభివృద్ధి చేసిన ప్రధాతగా పేరు తెచ్చుకున్న సండ్రను గెలిపించకుండా ప్రజలు ఎందుకు ఓడించారన్నది విశ్లేషకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అభివృద్ధి పనులు చే సే వ్యక్తిగా రాష్ట్రంలో సండ్రను మించిన వ్యక్తి లేడని ఆయన రాజకీయాలకు అతీతంగా అందరినీ ఆదరించే వ్యక్తిగా పేరున్న సండ్ర అభివృద్ధి పథకాలను నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లక పోవడమే ప్రధానంగా విఫలమయ్యారనే వాదనతో పాటు ప్రతి గ్రామంలో నాయకులు సంఖ్య అధికంగా సండ్ర వెంట ఉండటం, ఆయన చెవిలో జోరీల్లాగా మాట్లాడటం తప్ప ఆయన గెలుపుకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆనాయకుల తీరు పట్ల విశ్లేషకులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సండ్ర వెనక



చిన్న, చితన ఆదినాయకులు నిత్యం వెంట ఉండేవారని, వారందరినీ కలమశం లేకుండా నమ్మిన సండ్రకు చివరికి ఎన్నికల సమయంలో వారంతా ధనం, ఫైరవీల మీద ఉన్న ప్రేమతో వచ్చారే తప్ప ఆయన గెలుపు కాదని ఓటమి ఫలితాలను బట్టి అర్దమవుతుందని విశ్లేషకుల నుండి వ్యక్తమవుతుంది. నాయకులంతా వెంట తిరిగి కావాల్సిన పనులు చేయించుకొని ఎన్నికల సమయంలో సండ్రకు మనస్ఫూర్తిగా సహకరించకపోవడం వల్ల ఓటమి చవిచూడాల్సి వచ్చిందని ఇది సండ్ర కూడా ఊహించి ఉండరని విశ్లేషకులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లినా ప్రజలు తండోపతండాలుగా వచ్చి స్వాగతం పలికేవారని, తీరా ఓటింగ్ విషయానికి వచ్చే సరికి తేడా చూపించారని, ఈ లోపం ఎక్కడ జరిగింది ? ఎందుకు ఓట్లు సండ్రకు రాలేదు. ఈ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఈ ఓట్ల సంఖ్య వెనుక బడటానికి గల కారాణాలేంటని పలువురు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఎంపిపీలు, ఎంపిటీసీలు, జెడ్పిటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అద్యక్షులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎంతో మంది అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే అధికంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఐదు మండలాలు, ఈ ఐదు మండలాల్లో ప్రజా ప్రతినిధులు కానీ, నాయకులు గానీ వేళ్ల మీదనే లెక్క పెట్టేంతమంది ఉన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్యకు ఓట్ల సంఖ్య అన్ని మండలాల్లో తక్కువే వచ్చాయి. ఒక తల్లాడ మండలంలో మొదటి రౌండ్ లెక్కింపు మాత్రం సండ్రకు 203 ఓట్లు ఆధిక్యం మినహా, మిగతా 20 రౌండ్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి డా. రాఘమయికి అధికత్య వచ్చింది. అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించారన్నది స్పష్టమవుతుంది. ఆయన వెంట ఉన్న నాయకులంతా గ్రామాల్లో సండ్ర వెంకట వీరయ్య చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు ప్రచారం చేయడంలో విఫలమయ్యారనేది ఈ ఓట్ల ఫలితాలనుబట్టి అర్ధమవుతుంది.

**అందరు నాయకులు సండ్ర వెంటే :**

కాంగ్రెస్ టికెట్టు కోసం ఆశించిన ప్రధానమైన ముగ్గురు నేతలు చివరికి ఆ పార్టీ టికెట్టు రాకపోవడంతో ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ చేరి సండ్ర వెంట నిలిచారు. వార్డులో సీనియర్ కాంగ్రెస్‌నాయుకలు, మాజి మంత్రి సంభాని చంద్రశేఖర్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటూరి మానవతారాయ్, మరో నాయకుడు కొండూరు సూధాకర్ వీరు ముగ్గురు కాంగ్రెస్ టికెట్టు కోసం చివరి వరకు ప్రయత్నం చేసి టికెట్టు రాకపోవడంతో సండ్ర వైపుకు తిరిగారు. ఈ ముగ్గురుతోపాటు మండలాల్లో, గ్రామాలలో సండ్రకు ఉన్న నాయకులు ఆయన వెంట ఉన్నప్పటికీ ఒక్క సామాన్య వైద్యురాలు, మహిళ డా. రాఘమయి వెంట ఎవరూ లేక పోయినప్పటికీ ఆమెనే విజయం వరించిందంటే ఆయన వెంట తిరిగిన వారు మనస్ఫూర్తిగా పని చేయలేదనే వాదన విశ్లేషకుల నుండి వినిపిస్తుంది. కానీ నాయకుల నుండి మరో వాదన వినిపిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తుంది. ఆ గాలి మనకు సోకిందనే వాదిస్తున్నారు. ఇది కరెక్ట్ కాదని విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ 39 స్థానాలుగెలుచుకుంది.రాష్ట్రంలోఏ నియోజక వర్గంలో చేయని అభివృద్ధి ఈనియోజకవర్గంలో అభివృద్ధి విషయంలోకాని, సండ్ర వ్యక్తిత్వ విషయంలో కాని వాటన్నింటికంటే మన నియోజక వర్గమే అభివృద్ధికి పెట్టింది పేరు. కానీ నాయకులు తప్పిదాలు బయట పెట్టకుండా ఇలా గాలి వ్యాపిస్తుందనే పేరుతో తప్పించు కుంటున్నారని విశ్లేషకులల్లోని వాదన. వీటికి తోడు ఈ నియోజకవర్గంలోని రెండు సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు కూడా సండ్రకు వ్యతిరేకంగా ఓట్లు వేశారనే వాదన బలంగా వినిపిస్తుంది.

## బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

**మణుగూరు, ప్రభాతవార్త, డిసెంబర్ :**

మణుగూరు ఏరియాలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావతంతో కురుస్తున్న వర్షం వల్ల బొగ్గు ఉత్పత్తికి, ఓబీ వెలికితీతకు బ్రేక్ పడింది. మణుగూరు ఓసీ, పీకే ఓసీ-4, పీకే ఓసీ-2 గనుల్లోని క్వారీల్లో వర్షం వల్ల రోడ్లన్ని బురదమయం కావడంతో యంత్రాలు నడిచే పరిస్థితి లేక ఎక్కడికక్కడ



నిలిచిపోయాయి. దీంతో కోల్ ఉత్పత్తితో పాటు ఓవర్ బర్డెన్ వెలికితీతకు అంతరాయం ఏర్పడింది. ఆయా గనుల్లో నిల్వ ఉన్న బొగ్గును సరఫరా చేసినట్లు, ఏరియాలో 20 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైనట్లు మంగళవారం ఏరియా అధికారులు తెలిపారు.





## తుఫాను పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి
## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండండి
## ఎమ్మెల్యే డా. రాఘమయి

**సత్తుపల్లి, డిసెంబర్ 5, ప్రభాతవార్త:**



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హెడ్‌క్వాటర్‌లోనే ప్రజలకు అందుబాటులో ఉండాలని నూతన ఎమ్మెల్యే డా. మట్టా రాఘమయి దయానంద్ అధికారులను అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన మీ చౌంగ్ తుఫాన్ మరో రెండు రోజుల పాటు ఉండే అవకాశం ఉందని ప్రజలు అవసరం ఉంటే తప్ప ఇళ్ల నుండి బటయకు రావద్దని కోరారు. నియోజకవర్గంలో తుఫాను ప్రభావం కారణంగా ఎక్కడైనా ఆస్ది నష్టంకానీ, పంట నష్టం కానీ ఏర్పడితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు నష్టం జరిగిన ప్రాంతాల్లో ప్రజలు కానీ, రైతులు కానీ తన వాట్సప్ నెంబర్‌కు ఫోటోలు పంపాలని ఆమె సూచించారు. తుఫానుకు సంబంధించిన విషయమై ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవో, వ్యవసాయ, ఉధ్యాన, వాణిజ్య పంటల తదితర శాఖల అధికారులతో మాట్లాడి అప్రమత్తం చేశానని ఎమ్మెల్యే రాఘమయి తెలిపారు. ప్రజలు అధైర్య పడవద్దని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు బయటకు రావద్దని ఆమె కోరారు. నూతన ముఖ్య మంత్రి ఎంపిక కోసం హైదబాదు వెళ్లిన రాఘమయి అక్కడి నుండే తుఫానుకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అప్రమత్తం చేసినట్లు ప్రజలకు తెలిపారు.

## తుఫాను ప్రభావంతో ఓసీలలో నిలిచిన బొగ్గు
## 2 లక్షల క్యూబెక్ మీటర్ల ఓబీకి అంతరాయం



**సత్తుపల్లి, డిసెంబర్ 5, ప్రభాతవార్త:**

గత రెండు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన మీ చౌంగ్ తుఫాను కారణంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలలో బొగ్గు మరియు ఓవర్ బర్డెన్ పనులకు అంతరాయం కలిగింది. ఈ తుఫాను ప్రభావం మూలంగా కొత్తగూడెం సింగరేణి ఏరియా పరిధిలోని 25 వేల టన్నుల ఉత్పత్తికి, 2 లక్షల టన్నుల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికి తీయడానికి తీవ్ర అంతరాయం ఏర్పడిందని



కొత్తగూడెం సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు అన్నారు.రెండు రోజుల నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా ఓసీల్లోకి చేరినటువంటి నీటిని మోటర్ల ద్వారా వెలికి తీస్తున్నామని, నీరంతా బయటకు తీసిన అనంతరం తిరిగి బొగ్గు ఉత్పత్తిని తీయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ వర్షపాతం 10.మి.మీటర్లగా నమోదైందని వర్షం ప్రభావంతో బొగ్గు రవాణా చేసే వాహనాలు ఎక్కడవిక్కడే నిలిచాయి.

## నేడు పండితాపురం పశువుల సంత నిలుపుదల

**కామేపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త:**

మండలంలోని పండితాపురం పశువుల సంత నిర్వహణను బుధవారం నిలుపుదల చేస్తున్నట్లు ఆ పంచాయితీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ మంగళవారం తెలిపారు.కామేపల్లి పోలీస్‌ల సూచనల మేరకు కృష్ణప్రసాద్ పశువుల సంతను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.ఈ విషయాన్ని అమ్మకందారులు, కొనుగోలు దారులు, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# వరి పంటకు భారీ నష్టం.... మిర్చి రైతుల ఆందోళన

## రైతులను నష్టాలకు గురి చేస్తున్న అకాల వర్షాలు

*కారేపలి, డిసెంబర్ 5, ప్రభాతవార్త :*
తుఫాను ప్రభావంతో మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు కోతకు వచ్చిన వరి పంట



చేతి కందిన పత్తి రూ. లక్షలు పెట్టుబడులు పెట్టిన మిర్చి పంటకు భారీ నష్టం వాటిల్లింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మండలంలోని అనేక ప్రాంతాల్లో వరి కోతలు పోగు చేసిన వరి ధాన్యం పొలాల్లోనే ఉన్నాయి. అహర్నిశలు ఆరుగాలాల పాటు శ్రమించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్సాలు రైతుల ఆశలను ఆవిరిచేశాయి. సోమవారం రాత్రి కురుస్తున్న అకాల వర్షాల కారణంగా అపార నష్టం వాటిల్లిందని రైతులు అంటున్నారు. పంట చేతికి అందివచ్చిన సమయంలో ప్రకృతి కన్నెర చేయడం పట్ల రైతులు కన్నీరు



పెట్టుకుంటున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్దితుల ప్రభావంతో సింగరేణి మండలంలో పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి కురిసిన భారీ



అకాల వర్షంతో వరి, పత్తి పంటలకు అపార నష్టం చేకూరింది. ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేసిన పోలంపల్లి, మాదారం, పేరుపల్లి గ్రామాల్లో వరి పైరు నేలకొరిగి నీళ్ళలో పడిపోయాయి. అదే విధంగా అనేక ప్రాంతాల్లో పంట పొలాల్లో గాలి వర్షం ప్రభావం వరి పొలాల్లో పడిపోయి నష్టాన్ని మిగిల్చింది. చాలా



ప్రాంతాల్లో వరి పంట నెలకొరగడంతో పాటు పంట పొల్లాలోకి నీరు వచ్చి చేరడంతో ఇప్పట్లో వరికోత యంత్రం సహాయంతో పంటలన కోసే అవకాశం కూడా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్న పంట కూడా రంగుమారే అవకాశం ఉందనీ, ఇది ధరపై ప్రభావం పడేలా ఉందని చెబుతున్నారు. కాగా మెట్ట పంటగా సాగు చేసిన పత్తి దిగుబడి దశలో అకాల వర్షం నష్టాన్ని మిగిల్చింది. పత్తికాయలు రంగు మారడంతో పాటు పత్తి రంగు మారే అవకాశం ఏర్పడింది. కాగా మిర్చి తోటలకు కొంతమేర ఉపయోగకరంగా మారింది.

# అన్ని దానాల్లో కల్లా.... అవయవ దానం అత్యున్నతం....

*కారేపల్లి, డిసెంబర్ 5, ప్రభాతవార్త :*
అన్ని దానాల్లో కల్లా అవయవ దానం అత్యేన్నతమైనదని, మానవ జన్మకు మహా అవకాశమని, నేత్రదానంతో అందుల్లో వెలుగులు, అవయవదానంతో ఆరిపోయే ప్రాణాలకు ఆయుష్షును, దేహదానంతో భావి వైద్యుల పరిశోధనలకు ఉపయోగపడవచ్చునని ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని, తెలంగాన నేత్ర, శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , జాతీయ అవార్డు గ్రహిత డా॥ పరికిపండ్ల అశోక్ మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కారేపల్లి మండలం కొత్త కమలాపురంలో మచ్చ రామయ్య ఆధ్వర్యంలో జరిగిన అవయవ దానం అవగాహన కార్యక్రమంలో డా॥ అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.... చనిపోయిన




తర్వాత అవయవాలను కాల్చడం ద్వారా బూడిద పాలు, మట్టిలో పాతడం ద్వారా మట్టపాలు చేయకుండా అవయవదానం చేసి చిరంజీవులుగా మిగిలి పోవాలని తెలిపారు. భారతదేశంలో 12లక్షల మంది అందులు ఇంత వరకు ప్రపంచాన్ని చూడలేక, నేత్రదాతల కోసం ఎదురు చూస్తున్నారని ఆవేదన వెల్లిబుచ్చారు. అనంతరం అవయవదానం చేస్తామని ప్రయాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సలహాదారులు డా॥ ఆడెపు రాజేంద్రప్రసాద్, చాగంటి కిషన్, వడ్డే హన్మంత, రాములు, కొచ్చర్ల వినీత్, ఆవుల వీరయ్య, పృద్వీరాజ్, శేఖర్‌లతో పాటు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాము తదితరులు పాల్గొన్నారు.

# కామేపల్లిలో భారీ వర్షం.... ఆందోళనలో అన్నదాతలు

### పంట సంరక్షణకు రైతులు జాగ్రత్తలను తీసుకోవాలి

*కామేపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త:*
మిచౌంగ్ తుఫాన్ ప్రభావం వలన కామేపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా మంగళవారం భారీ వర్షం కురిసింది. వర్షం రాకతో విక్రయిం చేందుకు కల్లాల్లో ఆరపోసిన ధాన్యం తడిచిపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు విక్రయించే సమయానికి





కురుస్తున్న వర్షాలు తమను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని వాపోతున్నారు. ధాన్యం తడిచిపోకుండా పట్టాలు కప్పుతూ, నీటిని తోడివే స్తూ....తంటాలు పడుతు న్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. తెల్లవారుజాము నుండి కురుస్తున్న అకాల వర్షాల తో వరి పంట నేల కూలింది. దీంతో గింజలు మొలకెత్తే అవకాశం ఉంది. కోసేందుకు కూడా చాలా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

మరో 2రోజులు వర్షం ఇలానే ఉంటే పంట పూర్తిగా పాడైపోయే అవకాశం ఉంది. కోసిన పంటను రైతులు కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసి ఉండగా తడుస్తోంది. పంట తడవకుండా రైతులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. వ్యవసాయాధికారి బి.తారాదేవి క్షేత్రస్దాయిలో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించారు. వర్షాల వలన పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సలహాలు, సూచనలు ఆమె చేశారు.




### నేడు ఖమ్మంలో ఉచిత కృత్రిమ పాదాల కొలతల శిబిరం

*కారేపల్లి,డిసెంబర్ 5, ప్రభాతవార్త :*



ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాల వల్ల కాళ్ళు కోల్పోయిన వారికి ఉచిత కృత్రిమ పాదాలు అమర్చడం జరుగుతుందని కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ఖమ్మం రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 6న ఉదయం 9గంటల నుండి ఖమ్మంలోని కొత్త మున్సిపాలిటీ ఆఫీస్ రోడ్డు, గట్టయ్య సెంటర్, డీసీసీబి బ్యాంకు ప్రక్కన కృత్రిమ కాళ్ళ కొలతల శిభిరం నిర్వహించబడుతుంనది, ప్రమాదవశాత్తు కాళ్ళు కోల్పోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### ఘనంగా అయ్యప్పల ఇరుముడి



*కామేపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త:*
కామేపల్లి మండలం సాతానిగూడెం ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం ఘనంగానిర్వహించారు. దీక్ష ముగించుకుని శబరిమలైకి దీక్ష పరులు వెళ్లుతుండటంతో ఇరుముడిని సాంప్రదాయ బద్ధంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు గింజల నర్సింహారెడ్డి, లింగాల ఎంపీటీసీ సభ్యులు రామ్‌రెడ్డి జగన్నాథ్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు కీసర నర్సింహారెడ్డి, నాయకులు చంద్ర వెంకటయ్య, కీసర పరుషోత్తంరెడ్డి, బాబునాయక్, వీరబాబు స్వామి, శ్రీను స్వామి, సురేష్‌స్వామి, మాధవరావు స్వామి, రాము స్వామి తదితర స్వాములు పాల్గొన్నారు.

### పంట మార్పిడితో ప్రయోజనాలు అనేకం

**భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులను వాడాలి**



*కామేపల్లి, డిసెంబర్ 5 ప్రభాతవార్త:*
భూసారం పెరుగుదలకు సేంద్రియ ఎరువుల వాడకం ఎంతగానో దోహదపడుతుందని కామేపల్లి ఏవో బి.తారాదేవి అన్నారు. ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా రైతులకు భూసారం పెంపుదలకు రైతులకు మంగళవారం క్షేత్రస్థాయి సందర్శనలో పలు సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూసేంద్రియ ఎరువులను వాడి భూసారాన్ని పెంపొందించుకోవాలని, పచ్చిరొట్ట ఎరువులను వాడి భూమి సారం పెంపొందించవచ్చునని అన్నారు. జీవన ఎరువులు వాడి మొక్కలకు పోషకాలను అందుబాటులోకి తీసుకుని రావచ్చుని, పంట అవశేషాలను కాల్చి వేయకుండా నెలలోనే కలిపి వేయటం వలన భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుందని తెలిపారు. అనంతరం పప్పు దినుసుల పంటలతో పంట మార్పిడిని చేయడం వల్ల నేల సారవంతంగా మారుతుందని, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం చేసుకోవాలని అన్నారు. మల్చింగ్ చేయడం వలన నేలలోని తేమను పట్టి ఉంచే గుణం పెంపొందించబడుతుందని, దానివల్ల నేల కోతకు గురి కాకుండా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ విస్తరణాధికారి కె.ప్రతిభ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాన్ ప్రభావం వల్ల రానున్న రెండు రోజులు జిల్లాకు భారీ వర్షసూచన



కొత్తగూడెం కలెక్టరేట్, ప్రభాతవార్త: మిచౌంగ్ తుఫాన్ ప్రభావం వల్ల రానున్న రెండు రోజులు జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్న నేపధ్యంలో నేడు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై మంగళవారం ఉదయం అన్ని శాఖల జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తుఫాన్ ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు చేపట్టాలని, గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విపత్తు దృష్ట్యా సిబ్బందికి అన్ని రకాల సెలవులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. సెలవుల్లో వెళ్లిన సిబ్బంది తక్షణమే విధులకు హాజరుకావాలని, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. పశువులను మేతకు వదలకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని చెప్పారు. నిరంతరాయ వర్షాలతో వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున అలాంటి ప్రాంతాల్లో రాకపోకలు నియంత్రణకు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. చెరువులను పరిశీలించి తెగే అవకాశం ఉన్నచోట కట్ట సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇసుక బస్తాలను అందుబాటులో ఉంచాలని, గ్రామాలు, మున్సిపాలిటీల్లో శిధిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. వంగిన, విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు మంగళ, బుధవారాలు రెండు రోజులు సెలవు ప్రకటించినట్లు చెప్పారు. సంక్షేమశాఖల వసతి గృహాల్లో ఉండే విద్యార్థులను హాస్టల్ విడిచి బయటకు వెళ్లకుండా నియంత్రణ పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలకు కలెక్టర్ కార్యాలయంలో 08744-241950, కొత్తగూడెం 9392919750, భద్రాచలం ఆర్డీవో 08743-232444లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్లకు ఫోన్ చేయాలని ప్రజలకు

**ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి**
**లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి**
**టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల**

ఎనూచించారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా సాఫీగా వెళ్లేందుకు మురుగు కాల్వలు పరిశుభ్రం చేయాలని, నీళ్ల నిల్వ ప్రాంతాల్లో తగు చర్యలు చేపట్టి నీటి నిల్వలు లేకుండా చూడాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని చెప్పారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూధన్‌రాజు, డీపీవో రమాకాంత్, సీఈవో విద్యాలత, డీఈవో వెంకటేశ్వరచారి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, మహిళా శిశు సంక్షేమాధికారి విజేత, ఇరిగేషన్ అధికారులు వెంకటేశ్వర్‌రెడ్డి, అర్జున్, డీఆర్వో రవీంద్రనాథ్, ఆర్డీవోలు శిరీష, మంగీలాల్ పాల్గొన్నారు.

## అన్నదాతను నట్టేట ముంచిన తుఫాను

**వర్షానికి తడిచి ముద్దైన ధాన్యం**

సత్తుపల్లి, డిసెంబర్ 5, ప్రభాతవార్త: ఆరుకాలం కష్టపడి, చమటోర్చి పండించిన ధాన్యం చేతికి వచ్చే సమానికి ఆకాల వర్షం అన్నదాతను నట్టేట ముంచింది. బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగన తుఫాను ప్రభావంగా సోమ, మంగళ రెండు రోజులపాటు సత్తుపల్లి డివిజన్ వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంగా కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి వతదితర గ్రామాలలో రైతుల ధాన్యం పోసి కల్లాలపై ఆరబెట్టినటువంటి ఈ వర్షం మూలంగా తడిచి ముద్దైందని రైతులు లబోదిబోమంటున్నారు. కల్లూరు మండలంలోని పుల్లయ్య బంజర్ గ్రామంలో శివాలయం వద్ద ఆరబెట్టిన 50 వేల క్వింటాల పైగా ధాన్యం పరదాలు కప్పినప్పటికీ వర్షపు నీరు చేరి ధాన్యం ముద్దైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆ మండలంలో చిన్న కోరు కొండ, పెద్దకోరుకొండ, చెన్నూరు, లోకారం, లక్ష్మీపురం, కప్పలబంధం తదితర గ్రామాలలో 75 వేల క్వింటాల ధాన్యం కల్లాల్లో ఆరబెట్టి ఉంచామని, కొనుగోలు కేంద్రాల వారు ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం వల్లే అకాల వర్షం భారిన పడి వేలాది లక్షల్లో నష్టం



వాటిల్లిందని అన్నారు. అదే విధంగా ధాన్యంతో పాటు వరి, పత్తి ఇదే మండలంలో రాళ్ల బంజరు, చిన్న కోరు కొండ, పెద్దకోరుకొండ, చెన్నూరు, లోకారం, లక్ష్మీపురం, కప్పలబంధం, బత్తుపల్లి గ్రామాలలో ఈ పంట దెబ్బతిందని రైతులు లబోదిబో మంటున్నారు. పెనుబల్లి, సత్తుపల్లి మండలాల్లో వరిధాన్యం 30 వేల క్వింటాల్లో కల్లాల్లో ఆరబెట్టి పరదాలు కప్పినప్పటికి ధాన్యం తడిచి నష్టం వాటిల్లిందని ఆయా మండలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తుఫాను ప్రభావంగా దెబ్బతిన్న ధాన్యాన్ని సంబంధిత అధికారులు వచ్చి పరిశీలించి రైతులకు జరిగిన నష్టానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

# పేటలో ఎడతెరపి లేని వర్షం



**స్తంభించిన జనజీవనం**
**రైతులకు తీరని నష్టం**
**140.3 మి.మీ వర్షపాతం నమోదు**

అశ్వారావుపేట రూరల్, ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో మండల కేంద్రం అశ్వారావుపేటతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజాము నుండి ఎతడెరపి లేకుండా వర్షం పడింది. వర్షం ఆగకుండా కుండపోతగా కురుస్తుండటంతో జనజీవనం స్తంభించిపోయింది. ఈ క్రమంలో ఎక్కడివారు అక్కడే గృహాలకే పరిమితమయ్యారు. తుఫాన్ ప్రభావంతో జిల్లా కలెక్టర్ స్కూల్స్‌కు సెలవు ప్రకటించారు. వరణుడు దంచికొడటంతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. వాగొడ్డుగూడెం వద్ద వాగు పొంగి రోడ్డుపై నుండి ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలు జరగకుండా మూసి వేశారు. అదే విధంగా పలుచోట్ల రహదారుల జలమయం కాగా డ్రైనేజీలు పొంగి పొర్లి లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుండటంతో రోడ్లకు అడ్డంగా పలుచోట్ల భారీ వృక్షాలు కుప్పకూలాయి. తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా రైతులు ఆగమాగం అవుతున్నారు. మండలంలో వరిచేలు పొట్ట దశలో ఉండగా వరికోతలు ముమ్మరంగా సాగుతుండగా మరికొన్ని చోట్ల కోసి ఆరబెట్టారు. యంత్రాలతో కోతలు కోయగా ఆ ధాన్యం కల్లాల్లో తడవకుండా రైతులు బరకాలు కప్పి నానా అవస్థలు పడుతున్నారు. ఇంకా మరోరోజు వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఒకపక్క కల్లాల్లో ఆరబోయిన ధాన్యం, మరికొన్నచోట్ల కోత దశలో ఉన్న ధాన్యం ఉండటంతో రైతులు అయోమయం చెందుతున్నారు. ధాన్యంతో పాటు వేరుశనగ, పత్తి, మిరప పంటలకు కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉండగా ఈదురు గాలులకు అరటి తోటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి 8గంటల వరకూ అశ్వారావుపేటలో దాదాపు 140.3 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాబడినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

**నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు:** బంగాళ ఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట మండలంలో నేడు అనగా బుధవారం కూడా అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. హాస్టల్ విద్యార్థులు బయటకు రావద్దని సూచనలు చేశారు.

## మనోహరంగా రామయ్య కళ్యాణం





భద్రాచలంకల్చరల్ ప్రభాతవార్త: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో భద్రాద్రి రామయ్య కళ్యాణం మంగళవారం మనోహరంగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నది నుండి జలాలను మేలతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ ప్రధాన ఆలయానికి తీసుకున వచ్చి స్వామి వారి మూలవరులకు అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి కళ్యాణ మూర్తులను బేడా మండపానికి భక్తుల జయజయ ధ్వానాల నడుమ తీసుకుని వచ్చారు. ముందుగా భద్రాద్రి దివ్యక్షేత్ర మహత్యాన్ని భక్తులకు అర్చక స్వాములు తెలిపిన అనంతరం అమరవాది గోపాలకృష్ణమాచార్యులు కళ్యాణ తంతు ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన జరిపి కళ్యాణ తంతును కన్నుల పండువగా నిర్వహించారు. అనేక మంది దంపతులు ఈ కళ్యాణంలో పాల్గొని తరించారు. కళ్యాణం అనంతరం భక్తులకు స్వామి వారి నూతన వస్త్రాలు, అక్షతలు, ప్రసాదం వితరణ గావించారు.

## రాష్ట్ర ఫుట్‌బాల్ పరిశీలకునిగా ప్రేమ్‌కుమార్ బాధ్యతలు

కొత్తగూడెం స్పోర్ట్స్, డిసెంబర్ 5 – ప్రభాతవార్త:



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పరిశీలకులుగా జిల్లాకు చెందిన ఫుట్‌బాల్ జాతీయ క్రీడాకారుడు భట్టు ప్రేంకుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ వారి అనుమతితో రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి రామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8,9,10 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల నుంచి ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను జాతీయ స్థాయిలో పాల్గొనే జట్టుకు ఎంపిక చేసే ప్రక్రియలో ప్రధాన భూమికను ప్రేంకుమార్ పోషించనున్నారు. పాల్వంచ కేటీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రేంకుమార్ వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

## మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : పోలీస్ శాఖ

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త: తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అశ్వారావుపేట పోలీస్‌శాఖ సూచనలు చేసింది. ఎడతెరపి లేని వర్షంతో అశ్వారావుపేట నుండి రామన్నగూడెం వెళ్ళు రహదారిపై వాగొడ్డుగూడెం వద్ద రోడ్డుపై నుండి నీరు ప్రవహిస్తుందని కావున ఆ దారిని మూసివేసినట్లు తెలిపారు. కావున మండలంలోని రామన్నగూడెం, అనంతారం, గాండ్లగూడెం, కన్నాయిగూడెం, కావిడగుండ్ల గ్రామాలకు వెళ్ళే వారు ఊట్లపల్లి మీదుగా వెళ్ళవలసిందిగా సూచించారు. అంతే కాకుండా ఇంకా వర్షాలు పడుతున్న నేపధ్యంలో ప్రజలు ఎవరూ కూడా కరెంట్ స్తంభాలను ముట్టుకోవద్దని, వాటి వద్దకు వెళ్ళవద్దని, జాలర్లు చేపల వేటకు వాగులు, చెరువుల వద్దకు వెళ్ళ వద్దని సూచించారు. తక్షణ సహాయం కోసం డయల్ 100కి కాల్ చేయాలని లేకుంటే 8712682062, 8712682063 నెంబర్‌లకు సంప్రదించాలని పేర్కొన్నారు.